
# జీవస్వరం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి - 5 నవంబర్ - 2021 సంచిక - 5



# జీవస్వరం - 2021

## సువార్త స్వస్థత కూటములు

**తేదీలు :** డిసెంబర్ 3, 4 మరియు 5

**స్థలం :** నిర్మల్

**సమయం :** సా॥ 6 గం॥ల నుండి రాత్రి 9 గం॥ల వరకు

ప్రార్థన పూర్వకముగా సిద్ధపడండి

---



గౌ॥ ఫాదర్ జోర్జ్ మారాటుకళం

గురుపట్టాభిషేకం : 18-12-1972

జననం : 15 - 01 -1943 మరణం : 22- 10 - 2021

22-10-2021 నాడు

క్రీస్తు నందు నిద్రించిన గురుశ్రీ

**ఫాదర్ జోర్జు మారాటుకళం** గారికి

ఆదిలాబాద్ మేత్రాసన ప్రార్థన సుమాంజలి

సంపుటి - 5 నవంబర్ - 2021 సంచిక-5

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం.......................................3

నిత్యజీవము..................................................6

శోధన...........................................................8

బైబిల్ దర్శనం ..............................................10

పునీత చార్లెస్ బొరోమియా...............................13

శుభవచనం బైబిల్ క్విజ్....................................15

ఇంద్రధనుస్సు...............................................17

ఏంజెల్స్ కార్నర్...............................................18

యువస్పందన................................................19

బైబిల్ దృశ్యమాలిక.........................................21

శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు.....................23













**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**



**సంపాదక వర్గం**

| | |
|---|---|
| ఫాదర్ సిజో | ఫాదర్ ప్రిన్స్ |
| సిస్టర్ హృదయ ASMI | సిస్టర్ క్రిస్టీన CMC |
| Mr. M. సత్యం | Mr. J. లూర్థు స్వామి |
| Mrs. K. శ్రీలత | Mr. కిరణ్ కుమార్ రెడ్డి |

**టైపింగ్ సహకారం** – D. ప్రిన్సి



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
**మంచిర్యాల- 504 208**
**మంచిర్యాల జిల్లా**
**తెలంగాణ**

**Cell: 09398764408**

**Email ID - jeevaswarammagazineadb@gmail.com**

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

“ఈనాడు మీరు పాపము నుండి

విముక్తి పొంది, దేవునికి దాసులైతిరి.

పవిత్రతకు చెందిన మీ ఫలితమును

మీరు స్వీకరించితిరి. అంతేకాక, చివరకు

మీకు శాశ్వత జీవితము లభించును”

(రోమీ 6,22).

**ధ్యాన కేంద్ర నిర్మాణము**
**కొరకు ప్రార్థన**

ప్రభువా, నీ నామ మహిమ కొరకు మరియు ఆదిలాబాద్ గురుపీఠంలో సువార్త వ్యాప్తి కొరకు నిర్మించబడుతున్న ధ్యానకేంద్రాన్ని ఆశీర్వదించండి. ఎటువంటి ఆటంకములు లేకుండా దానిని సకాలంలో పూర్తి చేయుటకు తద్వారా మీ సువార్తను ప్రకటించుటకు మాకు అనుగ్రహం దయచేయమని ప్రార్థించుచున్నాము. ఆమెన్.



# తండ్రి గారి సందేశం....

## పరలోకం-దేవునితో నిత్య సహవాసం, నిత్య సంతోషం

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

"పరలోకములో మీకు గొప్ప బహుమానం కలదు" (మత్తయి 5,12; లూకా 6,23; యోహాను 14,2)- ఇది యేసు ప్రభు చేసిన గొప్ప వాగ్దానం. క్రైస్తవులుగా మనం జీవించే జీవితం మనకు ఇచ్చే పరమోన్నతమైన దీవెన పరలోక జీవితం. ఆ జీవితం అత్యధికమైన మహిమకలదై ఉంటుంది. పరలోకం గురించి మనం ధ్యానించినట్లుగా వేరే ఏ మతం ధ్యానించదు. అనేక కష్టాలు, బాధలు ఇతరులను నిరాశకు గురిచేస్తే మనలను అవే కష్టాలు పరలోక నిరీక్షణను కలుగజేస్తాయి. "బందీల బాధలలో మీరు పాలుపంచుకొంటిరి. మీ ఆస్తులన్ని స్వాధీన పరచుకొనబడినను, వాని కంటె మరింత మేలైనది శాశ్వతముగ నిలిచి యుండునది మీకు మిగిలి యున్నదని తెలియుటచే, మీ నష్టమును మీరు సంతోషముతో భరించితిరి" (హెబ్రీ 10,34). "ఇప్పుడు మనము పడుచున్న కష్టములు మనకు ప్రత్యక్షము చేయబడనున్న మహిమతో ఎంత మాత్రమును పోల్చదగినవికావు" (రోమీ 8,18). ఈ వచనాలు పరలోక నిరీక్షణను తెలియజేస్తాయి.

"గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని" యేసు ప్రభువు అన్నాడు (యోహాను 10,10). కాని "క్రీస్తు యేసు నందు భక్తిగల జీవితమును గడపదలచిన వారు అందరును హింసింపబడుదురు" (2 తిమోతీ 3,12) అన్నది యదార్థమైన సత్యం. "ఈ జీవితకాలముమట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించు వారమైన యెడల మనుష్యులందరి కంటె దౌర్భాగ్యులమై యుందుము" అని పరలోక నిరీక్షణ గురించి గురించి పౌలు గారు బోధించారు (1 కొరింతీ 15,19). "మనుష్యరీతిగా ఎఫెసులోని మృగములతో నేను పోరాడియున్నచో నేను పొందిన లాభమేమి? మరణించిన వారు జీవముతో లేవనెత్తబడనిచో, రేపు మనము మరణింతుము కనుక హాయిగా తిని త్రాగుదము" (1 కొరింతీ 15,32; యెషయా 22,13) అని క్రీస్తు కొరకు తాను అనుభవించిన బాధలను గురించి, తాను పొందబోయే నిత్యజీవం గురించి పౌలు గారు ఇలా వ్రాశాడు.

పరలోకంలో తన నివాసముంటుంది అనే నిరీక్షణ ప్రతి క్రైస్తవునికి ఆనందాన్ని కలిగిస్తుంది (రోమా 12,12). పాత నిబంధనలో చేయబడిన వాగ్దానాల కంటే ఇది శ్రేష్ఠమైన వాగ్దానం (హెబ్రీ 8,6; 10,34). దేవునితో చేసిన నిబంధనను యిస్రాయేలీయులు అనుసరించినట్లయితే, కనాను దేశమున దీర్ఘాయువుతోను, సంపదతోను జీవిస్తారని దేవుడు వారికి వాగ్దానం చేశాడు (ద్వితీ 4,13; 5,33). దేవుడు యిస్రాయేలీయులకు ప్రసాదించిన భూ వాగ్దానం కంటె శ్రేష్ఠమైనది పరలోకం. కాబట్టి, మన నిరీక్షణ, పరలోకంలో దేవునితో నిత్యనివాసమే (1 పేతురు 1,4). పరలోకంలోని ఆనందం ఈ లోకంలోని సిరిసంపదలు,

దీర్ఘాయువుల కంటే శ్రేష్ఠమైనది. మనం ఈ భూమి మీద ఎంత దీర్ఘకాలం బ్రతికి దేవుని దీవెనలను అనుభవించినా, భౌతిక జీవితం తాత్కాలికమయినదే. ఈ జీవితం గడిచిపోయాక తీర్పు తరువాత మనం సేవించిన దేవునితో పరలోకంలో నిత్యజీవితం (మత్తయి 25,34) లేదా ఆయనను సేవించడానికి నిరాకరించిన వారికి సిద్ధపరచబడిన నరకంలో నిత్యాగ్ని శోకం అన్నది క్రైస్తవ విశ్వాసం.

పరలోకం– భూమి మీద విమోచింపబడిన వారు నిత్యము నివసించబోయే దేవుని నివాస స్థలము (1 పేతురు 1,3–4). పరలోకం అనేది (1) దేవుని నిత్యరాజ్యము (మత్తయి 13,43). (2) రక్షింపబడిన వారి కొరకు సిద్ధపరచబడిన రాజ్యము (మత్తయి 25,34). ఈ రాజ్యము "పరలోక రాజ్యమని" (మత్తయి 4,17); "దేవుని రాజ్యమని" (మార్కు 1,15); "తన ప్రియపుత్రుని సామ్రాజ్యము" (కొలొస్సీ 1,13) అని పవిత్ర గ్రంథంలో సూచింపబడింది. రక్షింపబడినవారు ప్రవేశించే రాజ్యము, అది వారి నిత్య బహుమానం (మత్తయి 25,34). "మేము అనుభవించుచున్న ఈ చిన్న తాత్కాలిక కష్టము, ఆ కష్టమున కంటె ఎంతయో అధికమైన నిత్య మహిమను మాకు సమకూర్చును. గోచరములగు విషయములపై కాక, అగోచరములగు విషయములపై మా శ్రద్ధను కేంద్రీకరింతుము. గోచరములు కొలది కాలము మాత్రమే ఉండును. అగోచరములు శాశ్వతములు'' (2 కొరింతీ 4,17–18). పరలోక రాజ్యం అదృశ్యమైనది కాబట్టి నిత్యమైనది. పరలోకంలో మనం దేవుని మహిమను, తేజస్సును కన్నులారా చూస్తాం (రోమా 8,18). ఆ మహిమలో పాలివారమైయుంటాం (1 పేతురు 5,1). మనము తండ్రితో (దర్శన 21,3), ప్రభువైన యేసుతో (యోహాను 12,26), దేవదూతలతో (లూకా 9,26), రక్షింపబడిన వారందరితో మనముంటాం (మత్తయి 13,43). దేవునితో నిత్య సహవాసమే పరలోక జీవితం. పరలోకంలో మనం అనుభవించబోయే నిత్య సహవాసంతో భూలోకంలోని ఏ సహవాసమును, బాంధవ్యామును పోల్చలేము.

**పరలోకం ఎలా ఉంటుంది?**

సూర్యుడు, చంద్రుడు లేదా దీపకాంతిగాని, రాత్రి గాని అక్కడ ఉండదు (దర్శన 21,23; 25; 22,5). యేసు ప్రభువే పరలోకంలో వెలుగై ఉంటాడు. దేవునితో మనకు సన్నిహితమైన సంబంధముంటున్న కారణాన దేవాలయం అక్కడ అవసరముండదు, ఎందుకనగా, దేవుడు, గొఱ్ఱెపిల్ల దేవాలయమైయుంటారు (దర్శన 21,22). భౌతికమైన ఆహారం మనకు అవసరముండదు, ఎందుకంటే, జీవజలముల నది వలన, జీవవృక్ష ఫలముల వలన అక్కడ జీవము పోషింపబడుతుంది (దర్శన 22,1–2). మనం దేవునికి ఇక ఎన్నడు దూరం కాము, ఎందుకంటే "సింహాసనము నుండి ఒక గంభీరధ్వని వెలువడుట నేను వింటిని. ఇక దేవుడు మానవులతోనే నివసించును! ఇక ఆయన వారితోనే నివసించును! వారే ఆయన ప్రజలు. స్వయముగ దేవుడే వారితో ఉండును. ఆయన వారికి దేవుడగును" (దర్శన 21,3). అక్కడ ఏ శాపము ఉండదు (ప్రకటన 22,3). మన పరలోక నివాస స్థలంలో నీతి మాత్రమే నివసిస్తుంది (2 పేతురు 3,13). "ఆయన ముఖ దర్శనము" చేస్తూ ఉంటాం (దర్శన 22,4). ఆ ముఖాన్ని భౌతిక దేహంలో ఉన్న మనము ఎవరము చూచి బ్రదుకలేము (నిర్గమ 33,20).

పరలోక వాసుల మహిమను మనం కలిగియుంటాం. మనం క్రీస్తుతో కూడ మహిమ పరచబడతాం (రోమా 8,17; రోమా 2,7–10). మన తండ్రి రాజ్యములో మనం ''సూర్యుని వలె తేజరిల్లుతాం" (మత్తయి 13,43). "భువి నుండి పుట్టిన వానిని పోలి యుండిన మనము దివి నుండి వచ్చిన

వాని పోలికను పొందగలము" (1 కొరింథీ 15,49). మరణము ఎన్నటికి ఉండదు (లూకా 20,36; దర్శన 21,4). నిత్యజీవమును కలిగి ఉంటాము. పరలోకంలో మనం సంతోషాన్ని మాత్రమే అనుభవిస్తాము. దేవుడు- "వారి కనుల నుండి వెలువడు కన్నీటిని ఆయన తుడిచి వేయును. ఇక, మృత్యువుగాని, దు:ఖము గాని, ఏడ్పు గాని, బాధ గాని, ఏ మాత్రము ఉండబోదు" (దర్శన 21,4). మనం సంతోషంగా ప్రభువును సేవిస్తాం (దర్శన 22,3). పరలోకము ప్రేమకు, సహవాసానికి, ఆనందించడానికి అద్భుతమైన చోటైయుంటుంది.

**మరి పరలోక రాజ్యంలో ఎవరు ప్రవేశిస్తారు?**

1. దేవుని చిత్తాన్ని పాటించువారు (మత్తయి 7,21)
2. యేసు ప్రభువును విశ్వసించిన వారు (అ.కా 4,12; ఫిలిప్పీ 3,20-21; యోహాను 3,16)
3. మారు మనస్సు పొంది సువార్తను విశ్వసించిన వారు (మార్కు 1,14-15)
4. ఇతరులకు సేవ చేసిన వారు (మత్తయి 25,34)
5. నీతిమంతమైన జీవితం కలవారు (1 కొరింథీ 6,9)
6. దీనత్వము కలిగిన వారు (మత్తయి 5,3)
7. మరల జన్మించినవారు (యోహాను 3,34)
8. ధర్మార్థము హింసింపబడినవారు (మత్తయి 5,10)
9. తండ్రి ఇష్టపడిన వారు (మత్తయి 12,32)
10. ఓర్పుతో సత్కార్యములు చేయువారు (రోమీ 2,7)
11. శరీర క్రియులు చేయని వారు (గలతీ 5,19-21)
12. చిన్న పిల్లలవలే తగ్గించుకొనువారు (మత్తయి 7,13-14)
13. ఇరుకైన ద్వారం గుండా ప్రవేశించువారు (మత్తయి 7,13-14)
14. కష్టాలలో కూడ ఓర్పు, విశ్వాసం కలిగిన వారు (2 తెస్సలోని 1,4-5)
15. దొంగలు, దురాశపరులు, త్రాగుబోతులు, పరనిందాపరులు పరలోకం ప్రవేశింపలేరు (1 కొరింథీ 6,10)
16. యేసు ప్రభుని శరీర రక్తములను స్వీకరించినవారు (యోహాను 6,54)

పరలోకంలో ప్రవేశింపని వారు దేవునిపై తిరుగుబాటు చేసి అవినీతి జీవితాన్ని జీవించినవారు (1 కొరింథీ 6,9; గలతీ 5,19-21). వారు క్రీస్తు ప్రభువు యొక్క రక్తంచేత శుద్ధీకరింపబడలలేదు కనుక, వారు అపవిత్రతలోనే నిలిచినవారై, పరలోకంలో ప్రవేశింపనేరరు (దర్శన 21,27; 2 పేతురు 3,13). క్రీస్తు రక్తంచే శుద్ధీకరింపబడినవారే పరలోకంలో ప్రవేశిస్తారు (ఎఫెసీ 5,25-27; కొలొస్సీ 1,19-22).

తనకు విధేయులు కానివారిని దేవుడు యుగయుగాలు (నిరంతరం) శిక్షిస్తాడనే భావన భయానకంగా ఉంటుంది. నీతిమంతుల దీవెనలు ఎంత శాశ్వతమైనవో, దుర్నీతిపరుల శిక్ష కూడా అంత శాశ్వతమైనదే. మనం చేసే ప్రతిదానిలో దేవుని ఆనందింపజేసేలా ఈ నిశ్చయత మనం కలిగి జీవించాలి.

ప్రియ సహోదరీ సహోదరులారా! యేసు ప్రభువే రక్షకుడు, ఆయన యందు విశ్వసించిన వారు రక్షింపబడుతారు. నిత్యజీవము పొందుతారు. కాబట్టి, యేసు ప్రభువును గురించి తెలియని వారికి ఆయనను గూర్చి ప్రకటిద్దాం. అలా వారు, మనము, మనమందరం నిత్యజీవం పొందుతాము. అందుచేత పరలోకంలో దేవుని వారసులుగా పరలోక రాజ్యం చేరడానికి సిద్ధపడుదాం. ఈ లోకంలో మంచి జీవితం జీవిస్తూ, ఇతరులకు సహాయం చేస్తూ ముందుకు సాగుదాం.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

**క్రీస్తు నందు మీ తండ్రి**

**బిషప్ ప్రిన్స్ అంతోని**

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



# నిత్యజీవము

1. "నేను వానికి నిత్యజీవము ప్రసాదింతును. కనుక, అవి ఎప్పటికిని నాశనము చెందవు. వానిని ఎవడును నా చేతి నుండి అపహరింపలేడు"
(యోహాను 10,28).

2. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించి, తన ఏకైక కుమారుని ప్రసాదించెను. ఆయనను విశ్వసించు ప్రతివాడును నాశనము చెందక నిత్య జీవమును పొందుటకై అట్లు చేసెను" (యోహాను 3,16).

3. "మేము అనుభవించుచున్న ఈ చిన్న తాత్కాలిక కష్టము, ఆ కష్టమున కంటె ఎంతయో అధికమైన నిత్య మహిమను మాకు సమకూర్చును"
(2 కొరింతీ 4,17).

4. "దేవుని కుమారుని నామమును విశ్వసించు మీరు, నిత్యజీవము కలవారని తెలిసికొనుటకై మీకు ఇట్లు వ్రాయుచున్నాను" (1 యోహాను 5,13)

5. "ఏకైక సత్య దేవుడవగు నిన్నును, నీవు పంపిన యేసు క్రీస్తును వారు తెలిసికొనుటయే నిత్య జీవము"
(యోహాను 17,3)

6. "ఏలయన, పాపము యొక్క వేతనము మరణము, కాని, దేవుని కృపానుగ్రహము, మన ప్రభువగు క్రీస్తు యేసు నందు శాశ్వత జీవనము" (రోమీ 6,23).

7. "నేను ఇచ్చు నీటిని త్రాగువాడు ఎన్నటికిని దప్పికగొనడు. నేను ఇచ్చు నీరు వాని యందు నిత్యజీవమునకై ఊరెడి నీటి బుగ్గగా ఉండును"
(యోహాను 4,14).

8. "శారీరకమైన కోరికలు అను పొలములో అతడు విత్తనములు చల్లినచో శరీరము నుండి అతనికి లభించు ఫలసాయము క్షయమైనది. ఆత్మ అను పొలములో అతడు విత్తనము నాటినచో ఆత్మ నుండి అతడు శాశ్వత జీవితమను ఫల సాయమును పొందును"
(గలతీ 6,8).

9. "అందువలననే, క్రీస్తు యేసు నాపై సంపూర్ణ సహనమును, కనికరమును చూపెను. ఇక ముందు నిత్యజీవము పొందుటకై ఆయనను విశ్వసింపవలసిన వారందరికి నేను ఆదర్శ ప్రాయుడనుగా ఉండుటకే ప్రధాన పాపినైన నాయందు ఆ యన ఇట్లు చేసెను" (1 తిమోతి 1,16).

10. "పాపము మృత్యువు వలన పరిపాలించునట్లే, దేవుని అనుగ్రహము, మన ప్రభువగు యేసు క్రీస్తు ద్వారా మనలను శాశ్వత జీవమునకు నడుపుచు, నీతి మూలమగ పరిపాలించును" (రోమీ 5,21).

11. "దేవుని కుమారుడు దర్శనము ఇచ్చెననియు, యథార్థమగు దేవుని మనము గ్రహించు వివేకము మనకు ఒసగెననియు మనకు తెలియును. మనము దేవుని యందు, ఆయన కుమారుడగు యేసు క్రీస్తునందు ఉన్నాము. ఈయనయే యథార్థమగు దేవుడు. నిత్య జీవము" (1 యోహాను 5,20).

12. "ఈనాడు మీరు పాపము నుండి విముక్తి పొంది, దేవునికి దాసులైతిరి. పవిత్రతకు చెందిన మీ ఫలితమును మీరు స్వీకరించితిరి. అంతేకాక, చివరకు మీకు శాశ్వత జీవితము లభించును" (రోమీ 6,22).

13. "నా నిమిత్తము గృహములను గాని, సోదరులను గాని, సోదరీలను గాని, తల్లిని గాని, తండ్రిని గాని, బిడ్డలను గాని, భూములను గాని త్యజించిన ప్రతి వాడు నూరంతలు పొంది, నిత్యజీవమునకు వారసుడగును" (మత్తయి 19,29).

14. "ధర్మవర్తనము అను ఫలము నుండి జీవవృక్షము ఎదుగును. కాని చట్ట రాహిత్యము జీవమును నాశనము చేయును" (సామెతలు 12,30).

15. "దేవుని కుమారుని నామమును విశ్వసించు మీరు, నిత్యజీవము కలవారని తెలిసికొనుటకై మీకు ఇట్లు వ్రాయుచున్నాను" (1 యోహాను 5,13).

16. "జీవమునకు చేర్చు మార్గమును నీవు నాకు చూపింతువు. నీ సన్నిధిలో నేను పూర్ణానందమును పొందుదును. నీ కుడి చేతిలో శాశ్వత సుఖములు కలవు" (కీర్తన 16,11).

17. "నీ చేయి కాని, నీ కాలు కాని నీకు పాప కారణమైనచో దానిని నరికి పారవేయుము. కాళ్లు చేతులతో ఆరని అగ్నిలో దహింపబడుట కంటె, అంగవిహీనుడవై అమర జీవము పొందుట మేలు" (మత్తయి 18,8).


18. "నీవు నీ కుమారునకు అప్పగించిన వారందరకు ఆయన నిత్యజీవము ప్రసాదించుటకు నీవు ఆయనకు మానవులందరిపై అధికారమును ఒసగితివి" (యోహాను 17,2).

19. "ఓర్పుతో సత్కార్యములు చేయుచు, కీర్తి, ప్రతిష్ఠ, అమరత్వములను కోరు వారికి దేవుడు శాశ్వత జీవమును ఒసగును" (రోమీ 2,7).

20. "ఆయన అనుగ్రహము వలన మనము నీతి మంతులమై మనము ఆశించు నిత్య జీవమునకు వారసులమగుటకు ఆయన అట్లు చేసెను. ఇది సత్యము". (తీతు 3,7).

21. "మనము ఏమి అడిగినను ఆయన మన మనవిని ఆలకించునని మనకు తెలియును. కనుక మనము కోరినది ఆయన ఒసగునని మనకు తెలియును" (1 యోహాను 3,15).

22. "అగ్ని గుండము నుండి వెలుపలికి లాగి వారిని రక్షింపుడు. మరికొందరిపై మీ దయ భయముతో కూడినదై ఉండవలెను. కాని పాప భూయిష్టములగు వ్యామోహములచే మలినపడిన వారి దుస్తులను సహితము ద్వేషింపుడు" (యూదా 1,23).



# శోధన

**(గత సంచిక తరువాయి భాగం)**


యేసు ప్రభు శోధన గుండా వెళ్ళడానికి మరొక కారణం, ఆయన సమస్త ప్రజలకు ఒక మాదిరిగా ఉండడానికి మాదిరిగా ఎలా ఉండాలంటే తప్పు పట్టడానికి వీలు లేకుండా ఉండాలి. ప్రపంచంలోని ఏ మహాత్ముని అయినా చూడండి. అందుకే హెబ్రీ పత్రిక 12వ అధ్యాయం 1, 2 వచనాలు చదివితే యేసు ప్రభు ఒక్కరే మనకి మాదిరి అని మీరు గ్రహించగలరు. వాస్తవానికి యేసుప్రభు శోధనలను ఎలా జయించారు? సాన్నిహిత్యం! సాన్నిహిత్యానికి, సహవాసానికి, సాన్నిహిత్యానికి, స్నేహానికి ఏమిటి తేడా? స్నేహం బాగా ముదిరితే సాన్నిహిత్యం? తన తండ్రితో! (లూకా 22,39) మూడున్నర సంవత్సరాల ఆయన జీవితంలో ఆయన ఎప్పుడూ ప్రార్థనకు, వాక్యబోధనకు ఎంత ప్రాముఖ్యత ఇచ్చారో నాలుగు సువార్తలు చదివిన వారికి తెలుసు. శోధన అంటేనే ఒక యుద్ధంలాంటిది. ప్రతీ శోధనలో సైతానుకు ఒక వ్యూహం ఉంటుంది. అందుకే వాక్యంలో వాన్ని వేటాడే సింహంతో పోల్చారు. ఏ మాత్రం ఏమరుపాటు పనికి రాదు. ఏమరుపాటుతో ఉన్నామా! వాని వలలో చిక్కామన్న మాటే! ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ఎవరైతే అంతరంగికంగా దేవునితో గడుపుతారో వారే సాన్నిహిత్యాన్ని కలిగి ఉంటారు. దేవునితో వీలైనంతగా సాన్నిహిత్యాన్ని పెంచుకోవాలి. ఎంత ఎక్కువగా దేవునితో ఏకాంతంగా గడుపుతామో అంత ఎక్కువగా ఆయనకు సన్నిహితం కాగలుతాము.


దేవుడు మనతో ఎప్పుడు మాట్లాడుతాడో తెలుసా? రహస్యంగా గది తలుపులు మూసుకొని

ఎప్పుడు మనం ప్రార్థిస్తామో అప్పుడు మాట్లాడుతాడు. అంతరంగికంగా ఆయనతో ఎక్కువ గడిపే. వారితో మాట్లాడుతాడు. అంతరంగికంగా ఆయనతో ఎక్కువ గడిపే వారితో మాట్లాడుతాడు. దేవుని స్వరం నీకు ఎప్పుడు వినబడుతుందో తెలుసా? లోకం యొక్క స్వరం సద్దు మణిగిన తరువాతనే నీవు దేవుని స్వరం వినగలుగుతావు. అంతటి సాన్నిహిత్యం దేవునితో మనం కలిగి ఉండాలి. ఒక భక్తుడు ఏమంటాడంటే నీవు దేవుని చల్లని, మెల్లని స్వరం వినాలనుకుంటే ఈ లోకపు రణ, గొణ ధ్వనుల శబ్దాన్ని తగ్గించాలి. అంటే రహస్యమందున్న నీ తండ్రిని గది తలుపులు మూసుకొని ఏకాంతంగా ఆయనతో గడపాలి. అది మన జీవితంలో అలవాటుగా మారాలి. ఇక మరియొకటి ఆధారపడటం, ఒకటి గుర్తుపెట్టుకోండి. శోధనను ఎప్పుడు స్వంతంగా జయించలేము. ఎందుకంటే అపవాది చాలా బలం కలవాడు. ప్రార్థన అంటేనే ఆధారపడటం. ఒక క్రైస్తవ రచయిత ఏమంటాడంటే నువ్వు ప్రార్థన చేయడం లేదంటే నువ్వు పాపంలో పడ్డావని అర్థం. పేతురు మీకు గుర్తున్నాడనుకుంటాను. యేసు ప్రభు ఏమన్నారు "పేతురు నువ్వు పడిపోతావు". ప్రభూ, మీ కోసం ప్రాణమైన ఇస్తాను కాని శోధనలో పడను అని ఘంటా పథంగా చెప్పాడు. పేతురు శోధనలో ఎందుకు పడిపోయాడు? దేవుని మీద ఆధారపడక తన మీద తనే ఆధారపడటం. "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ స్వబుద్ధి అంతటి మీద యావే అధికారమునకు ఒప్పుకొనుము. అప్పుడు ఆయన నీ మార్గమును సరళము చేయును. యాకోబు 4,7లో ఏముందంటే, అపవాధిని ఎదిరించండి. అదే సందర్భంలో ఇంకో మాట ఏముందా వాక్యానికి ఎవరైతే విధేయత చూపిస్తారో వారు శోధనలను జయించగలుగుతారు. యేసు క్రీస్తు జీవితంలో అదే చూస్తాం. "ఆయన ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను."

ఆయన తండ్రికి లోబడ్డాడు కనుకనే జయించినవాడు అయ్యాడు. విధేయతలో అధికారమొస్తుంది. దేవునికి ఎప్పుడైతే మనం లోబడుతామో, అప్పుడు శోధనలను జయించ గలుగుతాం. చివరిగా శోధన వచ్చినప్పుడు మన దృష్టి దేనిమీదుండాలి? యేసు ప్రభు శోధన సమయంలో మనం గమనించవలసింది ఏమిటంటే అపవాధి పట్ల మనం జాగ్రత్తగా ఉండాలి. అంతేకాని మన ధ్యాసంతా అపవాధి మీదనే పెట్టవద్దు. యేసు ప్రభు అపవాధిని అసలు లక్ష్యపెట్టనేలేదు. మన దృష్టి, ధ్యాస అంతా దేవునిపై, యేసుపై మాత్రమే ఉండాలి. మన బలమైన యేసువైపే చూస్తూ, ఆయన శక్తితో ప్రతీ శోధన సునాయాసంగా జయిద్దాం! దేవుడు మనలందరిని దీవించునుగాక! ఆమెన్.

లూర్థుస్వామి, బెల్లంపల్లి





# యెరూషలేము బోధ
## మత్తయి 21-25 అధ్యాయాలు

ఈ భాగంలోని ముఖ్యాంశం ప్రభువు యెరూషలేములో బోధ చేయడం. హేరోదు దేవాలయం ఈ బోధకు కేంద్రం. ఇక్కడ చాలా అంశాలున్నాయి. వీటిని క్రమంగా పరిశీలిద్దాం. ప్రభువు గాడిదనెక్కి యెరూషలేము నగరం ప్రవేశించాడు. రాజులు గుర్రాలు ఎక్కుతారు. కనుక గాడిదనెక్కడం క్రీస్తు వినయానికి చిహ్నం. పురజనులు దావీదు కుమారునికి జయమంటూ నినాదాలు చేసారు.

యెరూషలేము దేవాలయం బేరసారాలతో నిండిఉంది. అది ప్రార్థనాలయమన్న సంగతి ప్రజల పూర్తిగా మరచిపోయారు. కనుక ప్రభువు దేవాలయాన్ని శుద్ధి చేసాడు. బేరగాళ్ళను వెళ్ళగొట్టి దాన్ని మళ్ళా ప్రార్థనాలయంగా మార్చాడు. ఈ దేవాలయ శుద్ధి క్రీస్తు మెస్సీయా ప్రజలను శుద్ధిచేస్తాడు అనడానికి గుర్తుగా ఉంటుంది. ఇంకా, ఈ శుద్ధి దేవాలయం త్వరలోనే అంతరిస్తుందనీ, దానిస్థానే తిరుసభ వ్యాప్తిలోకి వస్తుందనీ తెలియజేస్తుంది. ఈ ఘట్టమంతటా క్రీస్తు అధికారాన్ని ఠీవినీ ప్రదర్శిస్తాడు. మహా బోధకుడుగా దర్శనమిస్తాడు.

ఈ సందర్భంలోనే ప్రభువు బెతానియా నుండి తిరిగివస్తూ దారిప్రక్కన ఉన్న అంజూరాన్ని శపించాడు. ఇది నటనాత్మకమైన ఉపమానం. ఈయంజూరానికి పండ్లులేవు. క్రీస్తు ఎంత బోధించినా యూదనాయకుల్లో పశ్చాత్తాప ఫలాలు లేవు. ఈ చెట్టు శాపానికి గురైనట్లే తండ్రి తన కుమారుని అంగీకరించని యూదులను శపించి శిక్షిస్తాడని భావం. పూర్వం ప్రవక్తలు తమ బోధలను నటించి చూపించారు. క్రీస్తు కూడ ఇక్కడ ఈ పద్ధతిని అనుసరించాడు.

ప్రభువు బేరగాళ్ళను వెళ్ళగొట్టడమూ దేవాలయంలో బోధించడమూ చూచి ప్రధానర్చకులు నీకీయధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. క్రీస్తు వారిని యోహాను జ్ఞానస్నానాన్ని గూర్చి ఎదురు ప్రశ్న వేసి వారి నోళ్ళు మూయించాడు. ఈ సందర్భంలో యేసు మూడు ఉపమానాలు చెప్పాడు. నాలుగుసార్లు పరిస్యయులతో ఘర్షణపడ్డాడు. ఇక, వీటిని క్రమంగా పరిశీలిద్దాం.

**మూడు ఉపమానాలు :**

మూడు ఉపమానాల భావం ఒకటే. దైవరాజ్యం యూదుల నుండి తొలగింపబడి అన్యజాతివారికి అప్పగింపబడుతుంది. ఈ అన్యజాతి క్రైస్తవులే. ఇద్దరు కుమారుల కథలో చిన్నవాడు ద్రాక్షతోటకు వెళ్తానని చెప్పిగూడ వెళ్ళలేదు. ఇతడు యూద నాయకులకే గుర్తు. వారు దేవుని ఆజ్ఞలు పాటిస్తునట్లే నటిస్తారు కాని నిజంగా పాటించారు. కనుక దేవుని రాజ్యం వారి నుండి తొలగింపబడుతుంది. అది అన్యజాతికి దక్కుతుంది. దుష్టులైన కౌలుదార్ల కథలో ఆ దుష్టులు యజమానుని మీద తిరగబడ్డారు. అతని కుమారున్ని వధించారు. ఆ కుమారుడు క్రీస్తే కనుక తండ్రి వారిని దారుణంగా శిక్షిస్తాడు. దైవరాజ్యాన్ని క్రైస్తవ ప్రజలకు ఇస్తాడు. పెండ్లి విందు కథలో విందుకు రావడానికి నిరాకరించింది యూద నాయకులే. కడన పేదాబిక్కి వచ్చి ఆ విందును భుజించిపోయారు. ఇక్కడ ఈ విందు దైవరాజ్యానికి చిహ్నం. ఈ పేదాబిక్కి నూత్నవేద ప్రజలే. కనుక యూదులు దైవరాజ్యాన్ని పోగొట్టుకొంటారు. అది తర్వాత క్రైస్తవులకు దక్కుతుంది.

**నాలుగు ఘర్షణ కథలు :**

క్రీస్తుకి పరిస్యయులుతోను సద్దూకయులతోను నాల్గు ఘర్షణలు జరిగాయి. వారు అతన్ని వాదంలో ఓడించాలని వచ్చారు. కాని అతడే వారిని ఓడించాడు - 22,15-46. మొదటి ఘర్షణలో వారు కైసరు చక్రవర్తికి పన్ను చెల్లించడం న్యాయమా కాదా అని ప్రశ్నించారు. దేవునికి చెల్లించేవి దేవునికీ, చక్రవర్తికి చెల్లించేవి చక్రవర్తికీ చెల్లించమని చెప్పి క్రీస్తు వారు నోళ్ళు మూయించాడు. రెండవ దానిలో సద్దూకయులు పునరుత్థానం లేదని వాదించారు. కానీ క్రీస్తు అబ్రహాములాంటి పితరులు పునరుత్థానమై బ్రతికి ఉన్నారనీ, కనుక పునరుత్థానం ఉందనీ రుజువు చేసాడు. వారు బ్రతికి ఉండకపోతే దేవుడు కేవలం మృతులకే దేవుడౌతాడు. కాని అతడు సజీవులకు దేవుడు.

మూడవ ఘర్షణంలో మోషే ధర్మశాస్త్రంలో ఏది ముఖ్యమైన ఆజ్ఞ అనే ప్రశ్న వచ్చింది. క్రీస్తు దైవ ప్రేమ ప్రముఖ శాసనాలని జవాబు చెప్పాడు. దైవప్రేమ మొదటి ఆజ్ఞ. కాని సోదర ప్రేమ లేనిదే దైవ ప్రేమ లేదు. కనుక అవి రెండూ ముఖ్యమైనవే.

నాల్గవ దానిలో క్రీస్తే తన విరోధులైన పరిసయ్యులను ప్రశ్నించాడు. మెస్సీయా దావీదుకి కుమారుడు ఏలా అవుతాడో చెప్పమన్నాడు. మెస్సీయా దావీదుకి కుమారుడే. కాని దేవుని కుమారుడు కనుక అతడు దావీదుకి ప్రభువు కూడా. ఈ ఘర్షణలన్నిటిలోను అతడు పరిసయ బోధకులను మించిన బోధకుడని రుజువైంది.

23వ అధ్యాయమంతా డాంభికులైన పరిసయ్యుల ఖండనం. వారు తాము బోధించింది తామే ఆచరించరు. కనుక క్రీస్తు వారిని ఏడుసార్లు తెగడాడు. ఇక్కడ ప్రధాన సుత్రాలివి. మనం బోధించేది మనమే పాటించాలి - 23,3. మతాన్ని ఆసరాగా తీసుకొని మనలను మనం గొప్ప చేసుకోకూడదు. 23,7-10. దయ, న్యాయవర్తనం ముఖ్యం -23,23. కాని ఈ పరిసయ్యుల ఖండనను క్రీస్తు ఇక్కడ యథార్థంగా పలికి ఉండకపోవచ్చు. రచయిత దీన్ని క్రీస్తుచే పలికించి ఉండవచ్చు. ఈ విమర్శ మత్తయి నాడు క్రైస్తవులకూ పరిసయ్యులకూ మధ్య గల విరోధ భావాలనూ వాద-వివాదాలనూ సూచిస్తుంది

24-25 అధ్యాయాలు ఈ గ్రంథంలోని ఐదవ ఉపన్యాసం. 24వ అధ్యాయంలో మొదటి, రెండవ వచనాల్లో దేవాలయ పతనాన్ని గూర్చిన ప్రవచనం వస్తుంది. ఆ పురాతన మందిరాన్ని రోమీయులు త్వరలోనే ధ్వంసం చేస్తారు. అటు పిమ్మట అంత్యకాల వినాశనాన్ని గూర్చిన ప్రవచనం వస్తుంది. అప్పుడు వేదహింసలు, మతపరిత్యాగం, కపట ప్రవక్తల బోధలు, పరస్పర ద్వేషం, దొంగ మెస్సీయాల ఆగమన మొదలైన లక్షణాలు కన్పిస్తాయి. కట్టకడన మనుష్యకుమారుడు న్యాయాధిపతిగా విచ్చేసి ఎల్లరికీ తీర్పుతీరుస్తాడు. జనులు జాగరూకులై ఉండాలి. మనుష్య కుమారుడు దొంగలాగ తలవని తలంపుగా వస్తాడు - 24,44.

రెండవ రాకడ ఆలస్యం కావచ్చు. కనుక విశ్వాసుల జాగరూకతతో, పుణ్యక్రియలతో, భక్తివిశ్వాసాలతో ప్రభువు రెండవ రాకడ కొరకు వేచి ఉండాలి. ఈ సందర్భంలో క్రీస్తు నాలుగు ఉపమానాలు చెప్పాడు. నాల్గింటిలోను ముఖ్యభావం మెలకువతో వేచిఉండడమే. ఇక వీటిని క్రమంగా పరిశీలిద్దాం. 24వ అధ్యాయం చివరిలో నమ్మినబంటు, నమ్మనిబంటు అనే సామెత వస్తుంది. ఇది క్రైస్తవ నాయకులు ప్రమత్తులు కాక అప్రమత్తులై ఉండాలని సూచిస్తుంది. యజమనుడు తిరిగి వచ్చినప్పుడు తన కర్తవ్యాన్ని నెరవేరుస్తూ విశ్వాసపాత్రుడుగా మెలిగే సేవకునికి బహుమతి లభిస్తుంది. అలా చేయక దుష్కార్యాలకు పూనుకొనే దుష్ట సేవకునికి శిక్షపడుతుంది. నమ్మినబంటు మనకు ఆదర్శం.

25వ అధ్యాయం మొదటి పదిమంది కన్నెల సామెత వస్తుంది. ఇక్కడ ఐదుగురు కన్యలు పెండ్లి కుమారుడు రాగానే దివిటీలు సిద్ధం చేసికొని అతనితోపాటు వివాహోత్సవానికి వెళ్ళారు. వీరు రెండవ రాకడకు సిద్ధంగా ఉన్నవారు. మిగతా ఐదుగురు పెండ్లి కుమారుని రాకడకు, అనగా రెండవ రాకడకు తయారుగా లేరు. వీరికి వివాహశాలలోనికి ప్రవేశం లభించలేదు. ఈ వివాహశాల, అక్కడి విందు మోక్షానికే సూచనం.

అటుపిమ్మట ముగ్గురు సేవకుల కథ వస్తుంది. ఈ కథలో ఇద్దరు సేవకులు యజమానుడు కోరినట్లుగా కృషిచేసి అతడు తిరిగివచ్చినపుడు అతని మెప్పు పొందారు. ఇలాగే మంచి క్రైస్తవులు కూడ రెండవ రాకడ కొరకు కనిపెట్టుకొని ఉండాలి. దేవుని చిత్తాన్ని పాటిస్తూ మంచి పనులు చేస్తూ జీవించాలి. మూడవ దుష్ట సేవకునిలా అశ్రద్ధగా, నిష్క్రియపరులుగా ఉండిపోకూడదు. సోమరులుగా ఉండే వారికి శిక్షపడుతుంది.

కడన తుదితీర్పు సామెత వస్తుంది. ఇది క్రీస్తు చెప్పిన గొప్ప ఉపమానాల్లో ఒకటి. క్రీస్తు తోడినరుల్లో, విశేషంగా బాధలనునుభవించే పేదసాదల్లో వసిస్తుంటాడు. కనుక ఈ బాధార్తులను ఆదుకొంటే అతన్ని ఆదుకొన్నట్లే. వారిని పట్టించుకోకపోతే అతన్ని పట్టించుకోనట్లే. అంత్యదినాన న్యాయతీర్పు జరిగేప్పుడు మనం బాధల్లో ఉన్న తోటి జనులను ఆదుకొన్నామా లేదా అనేదాన్ని బట్టే మనకు మోక్ష బహుమానంగాని నరక శిక్షగాని లభిస్తుంది. మదర్ తెరిస్సాకు ప్రేరణం పుట్టించింది ఈ సామెతే. ఇది నేడు మనకు కూడ ప్రబోధం కలిగించాలి. ఇండియాలాంటి పేద దేశాల్లో ఆకలి గొన్నవారికి అన్నం పెట్టడం, బట్టలు లేనివారికి బట్టలీయడం, రోగులను పరామర్శించడం మొదలైన కరుణ కార్యాలు ఎప్పుడూ అవసరమే. ఈలాంటి కరుణ కార్యాల ద్వారా విశ్వాసులు తాము నిజమైన శిష్యులమని రుజువు చేసికోవాలి. మత్తయి సువిశేషం శిష్యులు పుణ్యకార్యాలు కరుణ కార్యాలు చేయాలని నొక్కి చెప్తుంది. ఈ సువిశేషంలో ఈ సామెత క్రీస్తు ఇక ఉపదేశించడు. కనుక అక్కరలో ఉన్నవారిని ఆదుకోవడం అతని ముఖ్యసందేశం అనుకోవాలి.

**సశేషం....**



# పునీత చార్లెస్ బొరోమియా
## (ఇటలీ కార్డినల్, ఉపదేశుల, సెమినరీ విద్యార్థుల పాలక పునీతులు, మతసాక్షి క్రీ॥శ॥ 1538 - 1584)

వ్యతిరేకులు విజృంభిస్తున్నకాలం. లూర్థు, కాల్విను, జ్వింగి అను క్రైస్తవనేతలు శ్రీసభలోని వివిధ సిద్ధాంతాలపై విభేదిస్తూ రోమునగరం కేంద్రంగా అపోస్తలుడు పునీత పేతురు అధిపత్య వారసత్వంగా పాపుగారి పాలనలోగల క్రైస్తవం నుండి విడిపోయారు. ఇంగ్లాండుకు చెందిన 8వ హెన్రీరాజు తనే ఇంగ్లాండులోని క్రైస్తవ మతం మొత్తానికి 'తల' అని స్వయంగా ప్రకటించుకున్నాడు. ఇట్టి దుస్థితిలో సమయానికి తగ్గ సరియైన వ్యక్తిలా పునీత చార్లెస్ బొరోమియో ప్రత్యక్షమయ్యారు. సత్యోపదేశ బోధనాన్ని విరివిగా విస్తరింప చేశారు. దైవార్చనాకాండను సరిదిద్దారు. ప్రజల ఆదర్శ బోధకుడులా సత్య సేవలందించారు.

చార్లెస్ గారు ఉత్తర ఇటలీలోని మజ్జియోరె సరస్సు ఒడ్డునగల అరోనా పట్టణంలో 1538 అక్టోబరు 2న జన్మించారు. తండ్రి పేరు కౌంట్ గిల్బర్ట్ బొరోమియా. తల్లిపేరు మర్గరెట్ దె మెదీచి. వీరు ధనవంతులు. వీరికి గల ఆరుగురు సంతానంలో చార్లెస్ గారు రెండవ వారు. పువ్వు పుట్టగానే పరిమళం వెదజల్లినట్లు చార్లెస్ బాల్యం నుండే దైవభక్తి దినదిన ప్రవర్ధమానమవుతూ తమ పన్నెండవ ఏటనే గురు దీక్షలోని ప్రథమ వ్రతాన్ని స్వీకరించారు. మిలానో నగరంలో ప్రాథమిక మరియు ఉన్నత విద్యను ముగించిన మీరు తమ ఇరవై రెండవ ఏటనే పౌర మరియు శ్రీసభ చట్టంలో పావియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. గురువిద్యలో డీకను కూడ అయ్యారు. పిమ్మట పోపు గారిచే డీకనుగా ఉన్న కార్డినలుగా ఎన్నుకోబడ్డారు. మరియు మిలాను పీఠానికి పాలకునిగా నియమితులయ్యారు.

ఆ రోజుల్లో శ్రీసభను పాలిస్తున్న 4వ పయస్ (భక్తినాథ) పాపుగారు కార్డినల్ చార్లెస్ గారికి స్వయాన మేనమామ. చార్లెస్ గారి చురుకుదనం, మేధాసంపత్తిని తెలుసుకున్న పాపుగారు వీరి సేవలను శ్రీసభకు వినియోగించే నిమిత్తం కార్డినలు, ఆర్చ్‌బిషప్ హోదాలకు ఎన్నుకున్నారు. క్రీ॥శ॥ 1562లో జరిగిన ఈ సభలో శ్రీసభ సత్యాల వివరణలు, శ్రీసభ సంస్కరణల గురించి ఈ సమావేశం కొన్ని శాసనాల్ని ప్రతిపాదించింది. విమర్శలకు తావిచ్చే కొన్ని విధానాలను తగురీతిగా సవరించింది. ఈలోగా డీకనుగా ఉన్న చార్లెస్ 1563 సెప్టెంబరులో గురువై మిలాను ఆర్చిబిషప్‌గా అభిషిక్తులయ్యారు. కాని ట్రెంట్ కౌన్సిల్ తీర్మానించిన విషయాల్ని ముఖ్యంగా సత్యోపదేశం పూజా గ్రంథం, గురువుల అనుదిన ప్రార్థనా పుస్తకం సవరించేందుకు శ్రీసభ వినియోగిస్తున్న భక్తి సంగీతాన్ని శ్రీసభ పాలనా విధానాన్ని సంస్కరించేందుకుగాను ఆర్చ్‌బిషప్ మరియు కార్డినల్ గారైన చార్లెస్ గారు రోము నగరంలోనే ఉండి పోవాల్సి వచ్చింది.

రోము నగరంలో తాము చేపట్టిన బాధ్యతలను నెరవేర్చుకున్న పిమ్మట చార్లెస్ గారు మిలాను అగ్ర పీఠ నివాసంకు చేరుకున్నారు. 16వ శతాబ్దంలోని ద్వితీయార్ధంలో వీరు ఈ నూతన బాధ్యతలను నెరవేర్చ శ్రీకారం చుట్టారు. వీరు తమ క్రైస్తవ మందకు మంచి

కాపరిగా నుండ శ్రమ తీసుకున్నారు. మేత్రాసనం అంతా కలియ తిరిగారు. క్రైస్తవులను తమ నీతిమయ విశ్వాసంలో బలపరచ అనేక చర్యలను చేపట్టారు. వీరు మిలాన్ అగ్రపీఠంలో తమకు వారసత్వంగా సంక్రమించిన విలువైన సామాగ్రిని, మూడు యుద్ధ నావలను అమ్మి వేసి శ్రీసభ అవసరాల కోసం వినియోగించారు.

కార్డినల్ మరియు ఆర్చిబిషప్ చార్లెస్ బొరోమియో గారు నిరాడంబర జీవితాన్ని గడుపుతూ, అన్నింటిలోను పొదుపును పాటిస్తూ, రోజుకు కేవలం నాలుగు గంటలు మాత్రమే నిద్రించేవారు. వీరి పాలనా కాలంలో శ్రీసభకు వ్యతిరేకముగా మొదలైన సంస్కరణ ఉద్యమానికి, తగు సమాధానం చెప్పేందుకు ప్రతి ఉద్యమాన్ని వీరు ప్రారంభించారు. చార్లెస్ గారు ఆరు ఆదర్శ కళాశాలలతో పాటు ఒక స్విస్ కళాశాలను కూడా మిలాను అగ్రపీఠంలో నెలకొనచేశారు. సామాన్య క్రైస్తవుల్లో నుండి గట్టి విశ్వాసులైన ఉపదేశకులను ఎన్నుకని వారికి శ్రీసభ విశ్వాస చట్టాలలో శిక్షణ నిచ్చి సుదూర ప్రాంతాలలోని గ్రామాలకు వారిని తరలించేవారు. దూరప్రాంతాలలో విచారణలు (గురుమండల కేంద్రాలు), సన్యాసుల ఆశ్రమాల్ని గురు విద్యాతర్ఫీదు ఆశ్రమాల్ని స్థాపించారు. తద్వారా మంత్ర తంత్ర విద్యల ప్రభావానికిలోనై, క్రైస్తవ వ్యతిరేక సిద్ధాంతాలకు లొంగిపోయిన అసంఖ్యాకమైన ఆత్మల్ని చార్లెస్ గారు రక్షింప గలిగారు.

కార్డినల్ మరియు ఆర్చిబిషప్ చార్లెస్ గారి పండితీ ప్రసంగాల్ని, క్రైస్తవ సిద్ధాంత వివరణల్ని స్వయంగా విశ్వాస సంపద పెంపుదల చేసికోడానికి భక్తులు వేలాదిగా వీరి దివ్యబలిపూజలకు హాజరౌతుండేవారు. అందువలన బలిపూజలో దివ్యసత్ప్రసాదం అందించడానికే కొన్ని గంటల సమయం పట్టేది. ఆ రోజుల్లో క్రీ॥శ॥ 1570లో మిలాన్ నగరంలో రెండేండ్లపాటు ప్లేగువ్యాధి వ్యాపించి అట్టుడికొపోయినప్పుడు చార్లెస్ గారు ఈ అంటు వ్యాధివల్ల మరణించడానికి కూడ సిద్ధపడి ఆసుపత్రులు ఆశ్రమాలలో ఉన్న బాధితులను సందర్శించారు. తాము పడుకునే మంచం, కూర్చేనే కుర్చీలు సహా అమ్మి ఆ ధనాన్ని ఈ బాధితుల కోసం వెచ్చించారు.

అటు తరువాత క్రీ॥శ॥ 1576లో కరువు రక్కసి విలయతాండవం చేసింది. వ్యాపారాలు కుంటుపడి ఆదాయం పడిపోయింది. గవర్నరు పాలన నిర్వీర్యంకాగా చార్లెస్ గారే రాజ్యపాలనా బాధ్యతలు చేపట్టారు. రాజ భవనాలలోని బ్యానర్లు ద్వారాలు కిటికీల తెరగుడ్డలు, టేబుల్‌పై వస్త్రాలు తీయించి పేదలకు దానం చేశారు. ఆకలితో అలమటించే పేద ప్రజలకు రోజుకు మూడువేల మందికి తగ్గకుండా ఉచిత అన్నపానీయాల నందించే ఏర్పాటు చేశారు. ఆ సమయంలో మేత్రాసనం నడిపేందుకు కావలసిన ధనం, ఇతర దాతల నుండి స్వీకరించిన డబ్బు పూర్తిగా హరించుకుపోయింది. కాని దేవునిపై భారంవేసి తన పాలనా బాధ్యతల్ని నిర్వఘ్నంగా నిర్వర్తించారు.

తన సంవత్సరాంత ఏకాంతదీక్షకై 1584 అక్టోబరులో 'మోంటె వరల్లో'కు వెళ్లారు. అక్టోబరు 24న జబ్బుకు గురయ్యారు. అక్టోబరు 29న మిలాన్‌కు బయలు దేరారు. మార్గం మధ్యలో అరోనాలో తన జన్మ స్థలంలో నవంబరు 1న సకల పునీతుల పండుగ రోజున తన చివరి పూజనర్పించారు. ఆ మరునాడు మిలానోలో తన నివాసానికి చేరుకుని మంచమెక్కారు. కడపటి అవస్థాభ్యంగాన్ని అడిగి భక్తితో స్వీకరించారు. దైవ స్మరణలో మునిగిపోయి తనను సేవించుటకు ఇంతవరకు సమయాన్ని ఇంచ్చినందుకు దేవునికి కృతజ్ఞతలర్పిస్తూ క్రీ॥శ॥ 1584 నవంబరు 1న తన 46వ ఏట పిన్న వయస్సులో స్వర్గస్తులయ్యారు. వారి సంపూర్ణ భక్తి విశ్వాసాలు, అపోస్తోలిక కార్యోత్సాహం, వీరోచిత ధర్మకార్యాలు మేత్రాసనంకు రెండవ పునీత అంబ్రోసు గారిగా కీర్తింపబడ్డారు. 5వ పోప్ పాల్ గారిచే క్రీ॥శ॥ 1616లో పునీత పట్టకు అర్హులై ఇటలీలోని లొంబార్డి ప్రాంత పాలక పునీతులుగా నియమింపబడ్డారు. ఆయా ప్రాంతాల్లో రోగాలు, తెగుళ్లు మహమ్మారిలా వ్యాపించినప్పుడు చార్లెస్ బొరోమీయో గారిని ప్రార్థిస్తే అవి వెంటనే తగ్గుముఖం పట్టి మటుమాయమవుతాయని భక్తుల విశ్వాసం. చార్లెస్ అనగా మానవతగల బలసంపన్నుడు అని భావం

# శుభవచనం బైబిల్ క్విజ్

**యెషయా గ్రంథము 45-66 అధ్యాయాలు**

పేరు ............................ఇంటి పేరు........................విచారణ .............................
ఫోన్ నెంబర్..................................

**I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి**

1) నేను మిమ్ము ఎలా ఓదార్తును?

2) ఏది కొరత బడినది?

3) ఎవరు నాకు జ్ఞానమును దయచేసెను?

4) నేను ఇష్టపడు ఉపవాస ఎటువంటిది?

5) ఎవరు నిన్ను పేరెత్తి పిలచెనని గ్రహింతువు?

6) నా దృష్టిలో ఇవి ఎవరి దినముల వంటివి?

7) ఎవరు మీ గొఱ్ఱెలమందలను కాయుదురు?

8) నా మందిరము ఎవరికి ప్రార్థనా మందిరమని పిలువబడును?

9) నా రక్షణము మీకు ఎలా లభించును?

10) భూమి యెల్ల .................................................. రక్షణను కాంచును.

11) ................................ జీవించు వారు చనిపోయిన పిదప .............................. బడయుదురు.

12) ..................................... మనకు చేసిన ................................. కార్యములను స్తుతించెదను.

13) మేము ............................................ నీవు ..................................................

14) నేను ...................................... పడినప్పటి నుండియు ..................................నన్నుకొనెను.

15) మీరు .......................................... దినమును పవిత్రము చేయుడు.

16) ...................................... దూరమయ్యెను ...................................... దగ్గరకు రాదయెను.

17) నన్ను ....................................................... వారిని నేను కాపాడుదును.

18) అతడు వారి కొరకు బండ నుండి ............................................. చేసెను.

19) నేను మీతో ................................................ నిబంధనము చేసికొందును.

20) నీ ................................................ ఆనందముతో పొంగిపోవును.

21) మన ................................................ కొరకు నలిగి పోయెను.

22) నా నామ ...................................... కొరకు నేను .....................................నణచు కొంటిని.

23) నేను .................................................... బడయు కాలము ఆసన్నమైనది.

24) ................................................ గూడ నిర్దయతో జూచితిని.


25) ................................................ వారికి భోజనము పెట్టుడు.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ నవంబర్ నెల 25వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: యిర్మీయా గ్రంథము 1-26 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు


దేవుని వాక్కు మన జీవితమునకు వెలుగు అని తెలిపే ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.




**పేరు:..................................వయస్సు........తరగతి........స్థలం.................**

<u>సూచన :</u>

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ నవంబర్ నెల 25వ తేదీలోపు మాకు పంపించాలి.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

**ప్రియమైన చిన్ని బిడ్డలారా!**

"జలములు మంటను చల్లార్చును. దానధర్మములు పాపములకు ప్రాయశ్చిత్తము చేయును. పరులకు ఉపకారము చేయువాడు తన భావి జీవితమును భద్రము చేసికొనినట్లే కష్టములు వచ్చినప్పుడు అతనికి సహాయము లభించును" (సీరా 3,30-31)

దేవునికి ప్రియమైన పుణ్యకార్యం దాన ధర్మములు. మనం దానం చేయునది ప్రభువుకే చెందుతుంది. ఎందుకంటే యేసయ్య ఏమన్నారు "ఈ అత్యల్పులైన నీ సహోదరునికి నీవు చేసిన మేలు నాకు చేసినట్లే" (మత్తయి 25,40). మనం ఉదారంగా పొందాము కాబట్టి మనం కూడా ఉదారంగానే ఇవ్వాలి. మన యేసయ్య స్వర్గాన్ని వీడి భువికి వచ్చి పసిబాలుడై పశుల పాకలో జన్మించి మనకై తన ప్రాణాన్ని అర్పించి నిత్యజీవాన్ని ప్రసాదించారు. మన జీవితంలో మనం పీల్చే శ్వాస మొదలుకొని ప్రతీది దేవుడు చాలా ప్రేమతో ఇచ్చిందే తల్లిదండ్రులను కుటుంబాన్ని, తల్లి తిరుసభలో బిడ్డలుగా, చదువుకునే అవకాశం ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. మన ప్రతీ అవసరాన్ని చాలా జాగ్రత్తగా తీరుస్తున్నారు. ఆ కరుణామయుని బిడ్డలమైన మనం కరుణ కలిగిన వారమై ఉండాలి. మన సమయాన్ని తెలివి తేటలను, ఆటవస్తువులను మనకిచ్చిన ప్రతీది ఇతరులతో పంచుకోవాలి. యేసయ్య మనకు నేర్పేది ప్రేమ-క్షమ. క్రైస్తవులు వారు చేసే సేవాకార్యాలతో గుర్తింపబడతారు. పేదల పట్ల సానుభూతి ప్రత్యేకమైన ఇష్టం మన యేసయ్యకు ఈ నెలలో ఆత్మల రక్షణకై ప్రార్థించే ఈ నెలలో మనదైన శైలిలో పరోపకారులమై దానధర్మములు చేయటానికి ప్రయత్నిద్దాం. చేద్దాం. దైవ ప్రేమను పంచుదాం. చాటుదాం. దేవుడు మిమ్ము దండిగా దీవించును గాక.




# ప్రభు మార్గములో నడుచువారు ధన్యులు

క్రీస్తు నాథుని యందు ప్రియ దేవుని బిడ్డలారా! ఈ ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరు త్వరగా స్థిర పడాలని కోరుకుంటున్నారే తప్ప ప్రభూ మార్గములో నడవాలని ఆశించడం లేదు. మనం గమనించాల్సింది ఏమిటంటే సులభమైన, విశాలమైన మార్గము నాశమునకు దారి తీస్తాయి. ఎక్కువ మంది విశాలమైన మార్గమును ఎన్నుకుంటున్నారే తప్ప ప్రభు మార్గమును ఎవరు ఎన్నుకోవడం లేదు.

**– ప్రభూ మార్గములో నడిచే వారు ధన్యులు అవుతారా?**

**– ప్రభూ మార్గం విశాలమైనదా? ఇరుకైనదా?**

"ఇరుకైనా ద్వారమున ప్రవేశింపుడు. ఏలనగా వెడల్పైన ద్వారము, సులభముగా నున్న మార్గము వినాశనమునకు చేర్చును. జీవమునకు పోవు ద్వారము ఇరుకైనది, మార్గము కష్టమైనది. కొలదిమందియే ఈ మార్గమును కనుగొందురు" (మత్తయి 7,13-14). ఈ వచనం యొక్క అర్థం ఏమిటంటే చాలా మంది ఎన్నుకొనే మార్గం సులభమైనది విశాలమైనది. ఈ మార్గం ద్వారా పయనించు వారికి లభించేది వినాశనము తప్ప మరేమి లేదు. కాని ప్రభు మార్గములో నడిచే వారికి జీవ కిరీటము లభిస్తుంది.

మార్గములలో రెండు రకాలు:

1. మంచి మార్గం 2. చెడు మార్గం

**1. మంచి మార్గం :**

"సత్పురుషుల, సజ్జనుల, నీతిమంతుల మార్గములు దేవునికి తెలుసు" (కీర్తన 1,6). సత్పురుషులు ఇతరులకు దారి చూపి వారిని మంచి మార్గములో నడిపిస్తారు. మొక్కలపై సూర్యకాంతిలాగా, ఆనందపు చిరునవ్వుల కాంతులు, తోటి వారిపై ప్రసరింప చేస్తారు.

ప్రభు మార్గములో నడుచువారు ఎల్లప్పుడు మంచి ఆలోచనలతో, ఆనందంగా, సంతోషంగా ఉండి వారి ఆశయాల కళలను నలుగురితో పంచుకుంటారు. సామెతలు 4,18వ వచనం గమనిస్తే "సత్పురుషుల మార్గము వేకువ వెలుగు వంటిది దాని ప్రకాశము పట్టపగలగు వరకును క్రమముగా వృద్ధి చెందును".

**2. చెడు మార్గం:**

కీర్తన 1,6వ వచనంలో కీర్తన కారుడు ఈ విధంగా తెలియచేస్తున్నారు. దుష్టుల మార్గము నాశనమునకు గురి అగును ఎందుకంటే వీరు ఎంచుకొన్న మార్గము విశాలమైనది సలభమైనది. ఈ మార్గము వినాశనమునకు గుర్తు. ఈ మార్గములో నడుచు వారు పదే పదే పాపము అనే ఊబిలో పడి రాత్రిభంవళ్ళు సతమతమవుతుంటారు.

సామెతలు 4,19వ వచనంలో సొలోమోను ప్రవక్తన ఈ విధంగా బోధించారు. "ధుర్మార్గుల మార్గము మాత్రము రాత్రివలే చీకటి మయముగా ఉండును ఏది తగిలి పడిపోవుదురో వారికే తెలియదు". మనం గమనించాల్సింది ఏమిటంటే ప్రభు మార్గములో నడుచువారికి ఎన్ని కష్టాలు, ఇబ్బందులు ఎదురైనప్పటికి దేవుడు అనుగ్రహించు శక్తిచే ఈ దురితములను ఎదుర్కొనగలరు. చెడు మార్గమును వదిలిపెట్టి స్వర్గమునకు పోవు ద్వారమునకు మూలకర్తయైన క్రీస్తును మనం అనుసరించాలి. ఎందుకంటే క్రీస్తే నిజమైన మార్గము పరలోక రాజ్యములో ప్రవేశించి మనల్ని సృష్టించిన ఆ పరలోక తండ్రి సముఖములో ఉండి, ఆ పరమ తండ్రికి ఎల్లవేళల స్తుతి ఆరాధనలు చెల్లించాలంటే ముందుగా పాపము అనే ఊబి నుండి వైదొలగి మంచి సుగుణాలను అలవరచుకోవడానికి కావలసిన కృపా సత్య అనుగ్రహములను ప్రసరింప చేయుమని ఆ ప్రేమా మయుని భక్తి పూర్వకంగా వేడుకుందాం.

## శుభవచనం బైబిల్ క్విజ్‌లో పాల్గొనే వారందరికి శుభవార్త


2021 జనవరి నెల నుండి క్రొత్త సిరీస్‌ను ప్రారంభించాము.
మే, జూన్ నెలలలో మాసపత్రిక ప్రచురింపబడలేదు.

1. ప్రతి నెల అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి నెల చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి.
2. ప్రతి నెల క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేరు మరియు మార్కులు వ్రాసి ఉంచుతాము. ఇలా అన్ని నెలలు క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి సంవత్సరం చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి. మొదటి బహుమతి రూ॥ 10,000/-లు, రెండవ బహుమతి రూ॥ 8,000/-లు, మూడవ బహుమతి రూ. 6,000/- సంవత్సరములోని అన్ని పరీక్షలలో పాల్గొన్నవారికి ప్రోత్సహక బహుమతులు ఇవ్వబడుతాయి.

**మీరు ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాము.**

# బైబిల్ దృశ్యమాలిక


12 మందా? మరి మీరు 10 మందే ఉన్నారే?
మీరు చెప్పేది అబద్ధంలా ఉంది. జైలులో వేయండి.
మాలో ఒకడు చనిపోయాడు. ఒకడు తండ్రి దగ్గర ఉన్నాడు.
!?
???
రెండు రోజులు జైలులో ఉంచారు. మూడవ రోజు
ఒకరిని ఇక్కడ ఉంచి, మీరు ధాన్యం తీసుకు వెళ్ళండి. మీ చిన్నతమ్ముని తీసుకొని వస్తే మీ మాటలు నమ్ముతాను.
?!
!!!?
సీమోనుని జైల్లో ఉంచారు.


జోసఫ్‌ని మోసగించి నందుకు దేవుడు శిక్షిస్తున్నాడు.
నేను అప్పుడే చెప్పాను. అతన్ని బాధించవద్దని
!
బెంజిమన్‌ని పంపమని నాన్నకు ఎలా చెప్పాలి
ఆహారం అంతా అయిపోయినప్పుడు బెంజిమన్‌ని జోసఫ్ వద్దకు పంపకు తప్పలేదు.
ఇతనేనా మీ చిన్న తమ్ముడు. నా భవంతికి రండి!
!!!!
మనల్ని ఖైదీలను చేస్తాడు
అవును. నాకు భయంగా ఉంది.

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

**యెషయా గ్రంథము 1- 22 అధ్యాయాలు**

1) పక్షి తన పిల్లల మీద రెక్కలు విప్పి వానిని కాపాడినట్లే సర్వశక్తిమంతుడునైన నేను యెరూషలేమును కాపాడుదురు (31,5)
2) హీబ్రూ భాషలో (36,13)
3) సంతోషముగా (38,17)
4) దేవదారులు, కసివింద చెట్లు గొంజి చెట్లు, ఓలివులు నాటుదురు (41,19)
5) యెరూషలేమును (29,6)
6) కుంటి (35,6)
7) మనలను (42,25)
8) సాక్షులు (44,8)
9) భూమ్యాకాశములకు, సింహాసనము (40,22)
10) మహత్యమును (29,23)
11) దేవుని ప్రజలు, శాంతి సమాధానములతో (32,18)
12) మిట్ట పల్లములు (40,4)
13) ప్రేమింతును (43,4)
14) భూమ్యాకాశములను (37,16)
15) షారోను (33,9)
16) ప్రభువును, రక్షణ దుర్గము (26,4)
17) అబద్ధమాడువారు (30,9)
18) భూమిని స్వాధీనము (34,17)
19) బబులోనియా (39,3)
20) పిలిచితిని (42,6)
21) నియమించిన (44,28)
22) దేవుడవు (25,1)
23) అబ్రహాము (41,8)
24) సేవకుడవని (44,21)
25) పవిత్ర నగరముపై (27,13)

**వచ్చే నెల పాఠ్యాంశం: యిర్మీయా గ్రంథము 1-26 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/–

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/–

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/–

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**<u>రచయితలారా, గమనించండి! వెంటనే రచనలు పంపండి!</u>**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**<u>మా అడ్రస్</u>**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల – 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswarammagazineadb@gmail.com

# వివిధ జోన్‌లలో యువజన సదస్సు చిత్రాలు

## కౌటాల, కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆదిలాబాద్



# జీవస్వరం ప్రార్థన బృందం

ప్రియ విశ్వాసులారా ప్రతి రోజు మీ కోసం **24** గం॥లు ప్రార్థన చేసే ప్రార్థనా సైనికులు సిద్ధంగా ఉన్నారు. నిత్యం మీ కొరకు మధ్యస్థ ప్రార్థనలు వారు చేస్తారు. ప్రార్థన సహాయం కొరకు మీరు సంప్రదించవలసిన నెంబరు

**8501975250**

ఈ నెంబరుకు ఫోన్ చేసి మీ విన్నపాలను, అవసరాలను మాకు తెలియపరచండి. మా ప్రార్థనా యోధులు మీకోసం మోకరించి ప్రభువుతో ప్రార్థిస్తారు. అదే విధంగా బైబిల్ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి గలవారు కూడా ఈ నెంబరును సంప్రదించగలరు. మీ జీవిత గమనములోని ఆటంకములు, బాధలు, అనారోగ్యములను ఎదుర్కొనే శక్తిని, ప్రభునందు భక్తిని, విశ్వాసాన్ని పెంపొందించుకొనుటకు ఆదిలాబాద్ గురుపీఠ జీవస్వరం ప్రార్థన యోధులు **మీ కోసం 24 గంటలు ప్రార్థించుటకు సిద్ధముగా ఉన్నారు.**

# జీవస్వరం సువార్త కూటము కొరకు ప్రార్థన

సర్వశక్తి మంతుడైన దేవా, మీకే ఆరాధన, స్తుతి, స్తోత్రము. "నేనే మార్గమును సత్యమును జీవమును" అని పలికిన ప్రభువా, మీ పవిత్ర మార్గములో నడిచి, సత్యమైన మిమ్ము తెలుసుకొని, మీ జీవమును పొందే ఆశీర్వాదం మాకు దయచేయండి.

జీవమునిచ్చుటకును దానిని సమృద్ధిగా ఇచ్చుటకును వచ్చిన దేవా, మీరిచ్చిన జీవమును సమృద్ధిగా పొందుటకు ఆదిలాబాదు గురుపీఠ దైవ ప్రజలకోసం మీరు ఏర్పాటు చేసిన "జీవస్వరం సువార్త స్వస్థత కూటము" ను బట్టి మేము మీకు వేలాది స్తోత్రములు చెల్లిస్తున్నాము. గురుపీఠ నలుమూలల నుండి మీ జీవస్వరమును ఆలకించుటకు వేలాది మందిని సమావేశపరచండి. మీ చిత్తానుసారంగా వాక్యమును బోధించుటకు వాక్యోపదేశకులను పవిత్రాత్మ శక్తిచే అభిషేకించండి. ఆత్మయు జీవమునైన మీ మాటలు మా గురుపీఠమంతటా వ్యాపింప చేయదానికి మేము చేస్తున్న ప్రయత్నాలను ఆశీర్వదించండి.

గలిలీయ సరస్సులో గాలిని అణచిన మీ వాక్కు, మరణించిన లాజరును జీవముతో లేపిన మీ వాక్కు, నీటిని ద్రాక్షారసముగా మార్చిన మీ వాక్కు, రోగులకు స్వస్థతనిచ్చిన మీ వాక్కు, పాపులకు క్షమాపణనిచ్చిన మీ వాక్కు జీవస్వరం కూటములో పాల్గొనే ప్రతి ఒక్కరిని పవిత్రీకరించి, బలపరచి, స్వస్థపరచును గాక. మీ పవిత్ర నామమునకు మహిమ కలిగే విధంగా జీవస్వరం సువార్తా కూటములో అద్భుతములు, స్వస్థతలు ధారాళంగా జరుగును గాక! ఆమేన్.

1 పర. 1 మంగళ. 1 త్రిత్వ.

ముద్రించు వారు : ఆదిలాబాద్ మేత్రాసన సువార్త విభాగం

*For Private Circulation Only*